వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 68 బుధవారం | 06 సెప్టెంబర్ 2023 | పేజీలు : 08 | వెల రూ. 5


## కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం


8లో

ములుగు ఎమ్మెల్యే సీతక్క

బీఆర్ఎస్ నుంచి పలువురు కాంగ్రెస్‌లో చేరిక

# అసంతృప్తులకు గాలం



అధికారమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పావులు కదుపుతోంది. ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ దూకుడు పెంచింది. పాత కాపులను తిరిగి రప్పించే పనిలో పడింది. ఇప్పటికే పొంగులేటి, జూపల్లి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోగా తుమ్మల నాగేశ్వర్ రావు లాంటి కీలక నేతలు బీఆర్ఎస్‌కు గుడ్ బై చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారు. అధికార పార్టీ సైతం తన ఫోకస్‌ను బీజేపీనుంచి కాంగ్రెస్ వైపు మళ్లించింది. దీంతో బీఆర్ఎస్ పార్టీని ఓడించాలంటే అది కాంగ్రెస్‌కే సాధ్యమన్న భావన ప్రజల్లో బలపడుతోంది. తాజాగా సిట్టింగులకే టికెట్ అంటూ బీఆర్ఎస్ చేసిన ప్రకటన కూడా ఆపార్టీకి కలిసొచ్చేలా ఉంది. టికెట్ రాని నేతలంతా ఇప్పుడు కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. ఇదే సమయంలో బీసీలకు పెద్ద పీట వేయనున్నట్లు టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి చేసిన ప్రకటన ఆ పార్టీకి మరింత బలాన్ని చేకూరుస్తోంది.

- వరంగల్ వాయిస్ ప్రతినిధి

- బీసీ ఓట్లే లక్ష్యంగా కాంగ్రెస్ ఎత్తులు
- టికెట్ల కేటాయింపులోనూ పెద్దపీట
- పోటాపోటీగా దరఖాస్తులు
- మరోమారు స్క్రీనింగ్ కమిటీ సమావేశం
- రానున్నది మన ప్రభుత్వమే అంటూ ప్రచారం

వివరాలు 2లో..


8లో

## విజన్ ఉన్న నేత కేసీఆర్

అన్ని రంగాల్లో తెలంగాణ అభివృద్ధి

పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు


8లో

## జర్నలిస్టులకు నివేశన స్థలాలను గుర్తించండి

కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను ఆదేశించిన దాస్యం, అరూరి


8లో

## ముంపు నివారణకు హైదరాబాద్ తరహా చర్యలు

9న మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా కాళోజీ కళాక్షేత్రం ప్రారంభం

ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, ఎంఏయూడీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్



# అసంతృప్తులకు గాలం

**బీసీ ఓట్లే లక్ష్యంగా కాంగ్రెస్ ఎత్తులు**
**టికెట్ల కేటాయింపులోనూ పెద్దపీట**
**పోటాపోటీగా దరఖాస్తులు**
**మరోమారు స్క్రీనింగ్ కమిటీ సమావేశం**
**రానున్నది మన ప్రభుత్వమే అంటూ ప్రచారం**

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** వరుస పరాజయాలు.. కీలక నేతల నిష్క్రమణలు.. అంతర్గత కుమ్ములాటలతో జీవన్మరణ సమస్యను ఎదుర్కొంటున్న కాంగ్రెస్ పార్టీకి కర్ణాటక విజయం నూతనోత్తేజాన్ని నింపింది. ఆ విజయమే తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని మళ్లీ బతికించింది. కర్ణాటక ఎన్నికల ముందు వరకు అధికార బీఆర్ ఎస్ కు ప్రత్యామ్నాయం భారతీయ జనతా పార్టీ గానే అందరూ భావించారు. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు దూకుడు పెంచడంతో పాటు బీజేపీ అనూహ్య రాతిలో నెమ్మది కావడంతో వెనకబడిపోయింది. దీంతో అధికార పార్టీ సైతం తన ఫోకస్ ను కాంగ్రెస్ వైపు మళ్లించడంతో బీఆర్ ఎస్ ను ఓడించాలంటే అది కాంగ్రెస్ పార్టీకే సాధ్యమన్న భావన ప్రజల్లో బలపడుతోంది.

## మరోమారు స్క్రీనింగ్ కమిటీ సమావేశం..

కాంగ్రెస్ పార్టీలోను ఆశావహుల సంఖ్య భారీగానే ఉంది. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాలకు గాను మొత్తం 1006మంది టికెట్ కేటాయించాలంటూ దరఖాస్తు చేస్తుకున్నారు. వడపోతలో భాగంగా రాష్ట్ర రాజధానిలో బుధవారం కాంగ్రెస్ పార్టీ స్క్రీనింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలోనే ఒక్కో నియోజకవర్గానికి ముగ్గురు అభ్యర్థుల చొప్పున ఎంపిక చేసి ఢిల్లీలోకి కేంద్ర కమిటీకి ఆ జాబితా అందజేస్తారని అందరూ భావించారు. అయితే త్వరలోనే బీఆర్ ఎస్, బీజేపీలనుంచి మరికొంత మంది కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశం ఉన్నందున స్క్రీనింగ్ కమిటీ సమావేశాన్ని మధ్యంతరంగా ముగించారు. మరి కొద్ది రోజుల్లో మరోమారు సమావేశమవుతామంటూ పార్టీ వర్గాలు ప్రకటించాయి. అయితే ఈ నెల 16న కాంగ్రెస్ కమిటీ సమావేశం, 17న సోనియాగాంధీ భహిరంగ సభ నిర్వహించనున్న నేపథ్యంలో ఆ తర్వాతే స్క్రీనింగ్ కమిటీ సమావేశం నిర్వహిస్తారన్న ప్రచారం సాగుతోంది.

## అందరి చూపు కాంగ్రెస్ వైపు..

అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ అధికార, ప్రతిపక్ష పార్టీలు వ్యూహాలు, ప్రతివ్యూహాలతో ముందుకెళ్తున్నాయి. అయితే రానున్నది మన ప్రభుత్వమే అంటూ కాంగ్రెస్ పార్టీ కొత్త రాగం అందుకుంది. ఈ క్రమంలో బీఆర్ఎస్, బీజేపీలో ఉన్న నేతలను తిరిగి కాంగ్రెస్‌లోకి రప్పించే ఏర్పాట్లలో ఆ పార్టీ నేతలు తలమునకలయ్యారు. ప్రధానంగా బీసీల ఓట్లను దృష్టిలో పెట్టుకుని వివిధ ప్రాంతాల నేతలను కాంగ్రెస్‌లోకి రప్పించే యత్నాలు జరుగుతున్నాయి. బీఆర్ఎస్, బీజేపీలతో భ్రమలు తొలగిపోయిన చాలామంది నేతలు ప్రస్తుత పరిస్థితుల్లో కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. ఆ పార్టీలో తనకు విలువ లేకుండా పోయిందని భావిస్తున్న వారంతా మెల్లగా బయటికొచ్చేందుకు నిర్ణయించుకుంటున్నారు. ఈ క్రమంలో పార్టీతో అవిరీతుమీకి సిద్ధమయ్యారు. కాంగ్రెస్‌లో చేరికకు ఇప్పటికే రంగం సిద్ధం చేసుకున్న అనేకులు తమ అనుచరలుతో కలసి ఆ పార్టీ తీర్థం పుచ్చుకునేందుకు వేచి చూస్తున్నారు.

## రేవంత్‌తో టచ్‌లో..

బీఆర్ఎస్ నుంచి టికెట్ ఆశించి భంగపడిన వారు కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఈ క్రమంలో పలువురు నేతలు నిరంతరంగా రేవంత్ రెడ్డితో టచ్ లో ఉంటున్నారు. ఇప్పటికే తుమ్మల నాగేశ్వర రావు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు గ్రౌండ్ ప్రిపేర్ చేసుకోగా స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య త్వరలోనే కాంగ్రెస్ పార్టీలో చేరుతారన్న ప్రచారం సాగుతోంది.

## ఒకే జాబితా..


ఇప్పటికే 115 మందితో తొలిజాబితాను రిలీజ్ చేసిన బీఆర్ఎస్‌కు దీటుగా సీఎం కేసీఆర్‌కు జలక్ ఇచ్చేలా తొలి జాబితా.. మలి జాబితా అని లేకుండా ఒకేసారి 119 మంది అభ్యర్థులతో కూడిన జాబితా రిలీజ్ చేసేందుకు కాంగ్రెస్ పార్టీ నేతలు సన్నాహాలు చేస్తున్నారు. సినిమా, వ్యాపార రంగాలతోపాటు ఎన్నారైలు కూడా పోటీ చేసేందుకు దరఖాస్తు చేసుకోవడంతో పోటీ తీవ్రంగా ఉంది. పాలకుర్తి నుంచి డాక్టర్ ఎర్రం రెడ్డి తిరుపతి రెడ్డి, అనుమాండ్ల ఝాన్సీ రెడ్డి, మక్తల్ నుంచి పోలీస్ చంద్రారెడ్డి, కొల్లాపూర్ నుంచి అభిలాష్ రావు, కల్వకుర్తి టికెట్ కోసం రఘు సుంకిరెడ్డి, ఎల్లారెడ్డి నుంచి మదన్ మోహన్ రెడ్డి, ఆదిలాబాద్ నుంచి కంది శ్రీనివాస్ రెడ్డి, జడ్చర్ల నుంచి మన్యం రాజశేఖర్ రెడ్డి దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో టికెట్ ఎవరికి దక్కుతుందనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## దరఖాస్తుకు దూరంగా సీనియర్ నేతలు..

కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్లు కొందరు టికెట్ కోసం దరఖాస్తు చేసుకోలేదు. మాజీ మంత్రి జానారెడ్డి, వీహెచ్ హనుమంతరావు, రేణుకా చౌదరి, గీతారెడ్డితో పాటు పలువురు సీనియర్ నేతలు దరఖాస్తుకు దూరంగా ఉన్నారు. అయితే.. జానారెడ్డి కుమారులిద్దరూ సాగర్ నుంచి పోటీ చేయడానికి దరఖాస్తు చేసుకోగా వీహెచ్ రాజ్యసభ ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. లేదంటే లోక్‌సభకు పోటీచేసే అవకాశాలున్నాయి. ఇక రేణుక చౌదరి ఖమ్మం పార్లమెంట్ నుంచి.. గీతారెడ్డి జహీరాబాద్ నుంచి ఎంపీగా పోటీచేసే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

**రేపు శ్రీకృష్ణాష్టమి పర్వదినం**

**గోకులాష్టమికి సర్వత్రా ఏర్పాట్లు**



# గోపికా.. వల్లభం

**వరంగల్ వాయిస్, కల్చరల్ :** హిందూ సంప్రదాయంలో ప్రతి పండకు, తిథికి ప్రత్యేకతలు ఉన్నాయి. తిథుల మేరకు పండగలు నిర్వహించడం, పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో గోకులాష్టమి వేడుకల ప్రత్యేకతే వేరు. తల్లులకు బాలకృష్ణునిగా, చిన్నవారికి చిలిపి కృష్ణునిగా, స్త్రీలకు గోపికా వల్లభునిగా, పెద్దలకు గీతాకారునిగా... ఇలా ప్రతి ఒక్కరి మదిలో ఏదో ఒక రూపాన కొలువై శ్రీకృష్ణుడు ఉంటాడు. అందుకే కృష్ణుని జన్మదినం అంటే, మన ఇంట్లో మనిషి పుట్టినరోజు అన్నంత ఘనంగా నిర్వహించుకుంటాం. శ్రావణబహుళ అష్టమి రోజున, రోహిణి నక్షత్రంలో కృష్ణుడు జన్మించాడు. ఈ కృష్ణాష్టమి రోజు ఉదయాన్నే నిద్రలేచి అభ్యంగన స్నానం చేయాలి. గుమ్మానికి తోరణాలు, గడపకు పసుపుకుంకుమలు, పూజగదిలో ముగ్గులు అద్ది పూజకు సిద్ధం కావాలి. ఆ బాలకృష్ణుని ఇంటికి ఆహ్వానిస్తూ, ఇంటి బయట నుంచి లోపలివరకు కృష్ణుని పాదాలను ముగ్గుతో వేయాలి. ఇతర పూజలకు భిన్నంగా కృష్ణాష్టమి పూజను మధ్యాహ్నం 12 గంటలకు ఆరంభించడం ఆనవాయితీ. వీలైతే ఆ సమయానికే పూజ సాగేలా చూసుకోవాలి. కృష్ణునికి తులసి అంటే చాలా ఇష్టం. అందుకని పూజలో ఆచమనం చేసే నీటిలో తులసి ఆకులు వేసుకుంటే మంచిదని చెబుతారు. ఆయన ప్రతిమను కూడా తులసిమాలతో అలంకరించమని సూచిస్తారు. కృష్ణునికి పొన్నచెట్టుతోనూ అనుబంధం ఉంది. వీలైతే ఆ పొన్న పూలతో ఆయనను పూజిస్తే మంచిది. ఆయనకు ఇష్టమైన తెలుపు లేదా పసుపు రంగు పూలతో పూజించినా శుభమే! కృష్ణాష్టకమ్, కృష్ణ అష్టోత్తరం వంటి స్తోత్రాలను చదువుతూ, పరిమళభరితమైన పుష్పాలతో ఆయనను అర్చించాలి. కృష్ణాష్టమి రోజున ఉపవాసం, జాగరణ చేసే ఆచారం ఉంది. కాబట్టి కృష్ణునికి కూడా సాత్వికమైన ఆహారాన్నే నివేదిస్తారు. వడపప్పు, పానకం, పళ్లు వంటి నివేదనలు సాధారణం. వీటితో పాటు ఆయనకు ఇష్టమైన పాలు, వెన్న, మీగడను కూడా ప్రసాదంగా సమర్పించవచ్చు. మరికొందరు... బాలింతలకు పెట్టే మినపపిండి, పంచదార కలిపి పెడతారు. కృష్ణుడు అప్పుడే జన్మించాడు కాబట్టి, ఆయన తల్లిని బాలింతరాలుగా భావిస్తూ ఈ ఆచారం మొదలై ఉండవచ్చు. చలికాలానికి శరీరాన్ని సిద్ధం చేయడం కూడా ఈ ప్రసాదం వెనుక పరమార్థంగా కనిపిస్తుంది. కృష్ణాష్టమి రోజు పూజతో పాటుగా ఆయన స్మరణ కూడా ముఖ్యమే! ఆ గోపాలుని వైభవాన్ని తెలియచేసే భాగవతం, భగవద్గీతలను ఈ రోజు ఎంతో కొంత పఠించాలి. అలా కృష్ణుని తలుస్తూ, కొలుస్తూ, భజిస్తూ కృష్ణాష్టమి రాత్రిని గడపాలి. కృష్ణుడు అర్ధరాత్రి జన్మించాడు కాబట్టి, కొందరు రాత్రివేళ్లే కృష్ణపూజ చేస్తారు.మరికొందరు హోళీ తరహాలో గులాల్ చల్లుకుంటూ తమ సంతోషాన్ని వ్యక్తపరుస్తారు. ఇంకొందరు చిన్న బాలకృష్ణుని ప్రతిమను మనసారా అలంకరించిచి, ఊయలలో ఉంచి రాత్రంతా ఆయన కోసం కీర్తనలు, భజనలు పాడుతూ ఉంటారు.



## పోషక లోపం నివారించేలా పోషణ మాసం నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** జిల్లాలో పోషక లోపం నివారించేలా కట్టుదిట్టంగా పోషణ మాసం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. బుధవారం పోషణ మాసం నిర్వహణ, పిల్లల ఆరోగ్యం, సామ్, మ్యం, పోషణ వివరాలు, భోజనం, విద్యా బోధనలు వంటి పలు అంశాలపై, తన చాంబర్ లో జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా సమావేశం నిర్వహించారు. సెప్టెంబర్ నెలలో నిర్వహిస్తున్న పోషన్ మాసం కార్యక్రమాన్ని కట్టుదిట్టంగా నిర్వహించడం ద్వారా పోషక లోపం పిల్లలు పూర్తిస్థాయిలో నిరోధించేలా కృషి చేయాలని, ప్రభుత్వం నిర్దేశించిన వివిధ కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. పోషణ్ మాసం కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని 644అంగన్వాడీ కేంద్రాలలో తల్లిపాలు ప్రాముఖ్యత, పిల్లల ఆరోగ్యం, మిషన్ లైఫ్ ద్వారా పోషకాహారాన్ని మెరుగుపరచడం, మిల్లెట్ పోషణ్ వాటికలను ప్రోత్సహించడం, రక్తహీనత తొలగించడం తదితర అంశాల నిర్దేశించిన కార్యక్రమాలను అమలు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. జిల్లాలో అధిక శాతం సిజేరియన్ ప్రసవాలు కావడం వల్ల తల్లి పిల్లలకు ముర్రె పాలు అందించడం వీలు కావడం లేదని, దీనివల్ల పిల్లలకు పోషకాహార లోపం వచ్చే ప్రమాదం ఉందని, దీని నివారణ కోసం సాధారణ ప్రసవాలు పెరిగే దిశగా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. నూతనంగా జన్మించిన శిశువులకు అందించవలసిన పౌష్టికాహారంపై అంగన్వాడీ కేంద్రాలలో తల్లులకు పిల్లల డాక్టర్లచే అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. జిల్లా స్థాయి అధికారులు మండల స్థాయి అధికారులు జిల్లాలోని



644 అంగన్ వాడీ కేంద్రాలు తనిఖీ చేసి అక్కడ పనితీరు వివరాలను నిర్దేశించిన నమూనాలో పకడ్బందీగా నమోదు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో ఉన్న పిల్లల ఆరోగ్య పరిస్థితి , వారి ఎదుగుదల అందిస్తున్న ఆహారం, నాణ్యత ప్రమాణాలు, పరిశు భ్రత మొదలగు విషయాలు తనిఖీ చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఉన్న అంగన్వాడీ కేంద్రాలో ప్రతి ఒక్క పిల్లవాడి సంపూర్ణ వివరాలు నోట్ చేయాలని, వారి ఎత్తు, బరువు, పోషక లోపం, సామ్ , మ్యాం పిల్లలు తదితర వివరాలు నమోదు చేయాలని తెలిపారు. జిల్లాలోని ప్రతి అంగన్వాడీ కేంద్రానికి కుర్చీలను, కోడి గుడ్ల భద్ర పరిచే ఐరెన్ ర్యాకులను అవసరమైన సామాగ్రిని త్వరలో పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, అంగన్వాడి కేంద్రాల్లో పిల్లలకు తెలుగు ఆంగ్ల భాష బేసిక్స్ పై పట్టు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని, పిల్లలు విటమిన్ డి లోపం లేకుండా చూడాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ పోషణ మాసం సంబంధించిన వాల్ పోస్టర్ ను ఆవిష్కరించి అధికారులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డి. డబ్ల్యూఓ నాగేశ్వరరావు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగులకు బస్‌పాసుల పంపిణీ



**వరంగల్ వాయిస్, శాయంపేట :** రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం రాయితీతో వికలాంగులకు అందజేస్తున్న బస్సు పాసులను మండల కేంద్రంలోని జీపీ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బుధవారం 30మందికి బస్సు పాసులను అందజేసినట్లు వరంగల్ డిపో కంట్రోలర్ ఎల్.శంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మడికొండ రత్నాకర్, కారోబార్ బాసని రమేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయురాలి మృతి

**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** నల్గొండ జిల్లా పెన్ పహాడ్ మండలం సింగిరెడ్డిపాలెం ప్రాథమిక పాఠశాల హెడ్మాస్టర్ కవిత రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఐచ్చిక సెలవు రద్దైయిందని ఆలస్యంగా సమాచారం అందుకున్న లింగయ్య, కవిత ఉపాధ్యాయ దంపతులు హడావుడిగా పాఠశాలకు వెళ్లే క్రమంలో మార్గంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. కవిత ఘటనా స్థలంలోనే మరణించగా లింగయ్య తీవ్రంగా గాయపడి ప్రస్తుతం సూర్యాపేట ఏరియా హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారు. విద్యాశాఖ అనాలోచిత నిర్ణయాల వల్ల ఒక ఉపాధ్యాయురాలు ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటన నుండైనా విద్యాశాఖ అధికారులు కళ్లు తెరవాలని ఇటువంటి అనాలోచిత ఆకస్మిక నిర్ణయాలు మానుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ ఫెడరేషన్ సూర్యాపేట జిల్లా కమిటీ డిమాండ్ చేశారు. ఈ సంఘటన పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, కవిత మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తపరిచారు.

## మేరీ మిట్టి మేరా దేశ్



**వరంగల్ వాయిస్, ఆత్మకూర్ :** "మేరీ మిట్టి మేరా దేశ్" కార్యక్రమంలో భాగంగా దేశం కోసం ప్రాణాలర్పించిన త్యాగవీరుల కోసం ప్రధాని నరేంద్ర మోడీ దేశ రాజధాని ఢిల్లీలో పవిత్ర అమృత స్మృతి వనం నిర్మించినున్న నేపథ్యంలో బుధవారం పరకాల నియోజకవర్గం ఆత్మకూర్ మండలంలోని శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయంలో అమృత కలశానికి పూజ, పంచ ప్రాణ్ ప్రతిజ్ఞ చేసి ఇంటింటి నుంచి మన దేశం మట్టిని సేకరించే కార్యక్రమంలో పరకాల కాంటెస్టెడ్ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి పాల్గొన్నారు. మండల అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందం, ఆర్టీఐ జిల్లా కన్వీనర్ ఎదులాపురం శ్రవణ్ కుమార్, కిసాన్ మోర్చా పరకాల కన్వీనర్ వంగాల బుచ్చిరెడ్డి, కిసాన్ మోర్చా మాజీ జిల్లా అధ్యక్షుడు గుళ్లపల్లి వెంకటేశ్వర్లు, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు వెలిదే సదానందం, పూజారి సత్యనారాయణ, మండల కార్యదర్శులు పైడాచార్య, జిట్ట మధు, బూత్ అధ్యక్షులు పిసాల సాంబయ్య, భయ్యా మలగాం, రామకృష్ణ, సమ్మయ్య, కుక్కల సదయ్య, భయ్యా భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ




**వరంగల్ వాయిస్, కాజీపేట :** గ్రేటర్ వరంగల్ 45వ డివిజన్ పరిధిలోని కడిపికొండ గ్రామ వరద బాధితులకు బాలవికాస, ఆమెజాన్ వారి సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నిత్యావసర కిట్లను బీఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే అరూరి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ కార్పొరేటర్ ఇండ్ల నాగేశ్వరరావు, డివిజన్ నాయకులు రాంచంద్రా రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు శాంతికుమార్, డివిజన్ మహిళ అధ్యక్షురాలు నాగమణి, మైనారిటీ నాయకులు షేక్ బాబా, జనరల్ సెక్రటరీ రాజేశ్, యూత్ నాయకులు ప్రేమ్ రాజు, సందీప్, శశి హరీష్, మహిళ నాయకురాలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## పుట్ట మధుపై అనుచిత వ్యాఖ్యలు తగవు



**వరంగల్ వాయిస్, మల్హర్:** పెద్దపల్లి జడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ మంథని ఇంచార్జి పుట్ట మధుపై కాటారం సింగిల్ విండో చైర్మన్ చల్లా నారాయణ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని, పార్టీలో ఉంటూ పార్టీకి నష్టం కలిగించే చర్యలకు పాల్పడితే సహించేది లేదని మల్హర్ మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు హెచ్చరించారు. బుధవారం మండలంలోని కొయ్యూరు ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నారాయణ రెడ్డి వ్యవహారం తిన్నింటి వాసాలు లెక్క పెట్టే విధంగా ఉందని, ముఖ్యమంత్రి కేసీఆర్ అభ్యర్థులను ఖరారు చేసిన క్రమంలో పుట్ట మధుకు టికెట్ కేటాయించారని, పార్టీ నిర్ణయం మేరకు మధు గెలుపు కోసం పాటు పడకుండా తన సొంత ఎజెండాను అమలు చేయడం, ఆత్మీయ సమ్మేళనాల పేరుతో పుట్ట మధుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే రానున్న కాలంలో ప్రజలే బుద్ధి చెబుతారని ఇకనైనా నారాయణ రెడ్డి తన నిర్ణయం మార్చుకొని పార్టీ కోసం కష్టపడాలని, లేకుంటే పార్టీ నుంచి సస్పెండ్ చేయడానికి కూడా వెనకాడమని హెచ్చరించారు. మండల పార్టీ అధ్యక్షుడు కుంభం రాఘవరెడ్డి, మహిళ అధ్యక్షురాలు చంద్రకళ, రైతు బంధు సమితి అధ్యక్షుడు గోనె శ్రీనివాస్ రావు, నాయకులు కోట రవి, వాల యాదగిరి రావు, మల్క సూర్య ప్రకాష్ రావు, అయూబ్ ఖాన్, కుంభం సురేష్ రెడ్డి, బాద్రపు సమ్మయ్య, బూడిద సదానందం, అడ్డూరి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## 10న గద్దర్ సంస్మరణ సభ

### సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఈ నెల 10న వరంగల్ లో నిర్వహిస్తున్న ప్రజా యుద్ధనౌక గద్దర్ సంస్మరణ సభను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు కోరారు. బుధవారం వరంగల్ తమ్మెర భవన్ శివనగర్ లో ఏఐటీయూసీ, తెలంగాణ ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు దామెర కృష్ణ అధ్యక్షతన గద్దర్ సంస్కరణ సభ కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో 10న గద్దర్ సంస్మరణ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గద్దర్ త్యాగం మహోన్నతమైనదని, అనేక ప్రజా పోరాటాలు చేసిన గద్దర్ మన మధ్య లేకపోయినా తను పాడిన పాట సూర్య, చంద్రులు ఉన్నంత వరకు ప్రజల గొంతుకలలో తన పాట బతికే ఉంటదని అన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, సహాయ కార్యదర్శి షేక్ బాష్ మియా, పనాస ప్రసాద్, ప్రజా నాట్యమండలి వరంగల్ జిల్లా నిర్మాణ బాధ్యులు గన్నారపు రమేష్ , సీపీఐ జిల్లా నాయకులు దండు లక్ష్మణ్, తెలంగాణ ప్రజానాట్యమండలి వరంగల్ జిల్లా అధ్యక్షుడు దామెర కృష్ణ ,బోళ్ల వసంత, కుంట శాంతి, లక్ష్మి శారద , సరోజన, మంజుల , నాలిక రజిత, నవ్య, ఎల్లమ్మ, నిహారిక ,రవళి, సరోజన, భిక్షపతి, ఆరోగ్యం, జన్ను రాజు, లలిత, స్వప్న పాల్గొన్నారు.

## విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

### బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాదారపు శివకుమార్

**వరంగల్ వాయిస్, వరంగల్ :** గీసుగొండ మండలం గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ మొగిలిచర్లలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు బిల్లా రమేష్ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు రాదారపు శివకుమార్ విచ్చేసి మాట్లాడుతూ ఉద్యమ సమయంలో అప్పటి టీఆర్ఎస్ ఇప్పటి బీఆర్ఎస్ పార్టీ తెలంగాణలో అధికారంలోకి వస్తే సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తామని ఇచ్చిన మాటకు కట్టుబడి అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. నిజాం ప్రభుత్వం ఆధీనంలో నుంచి విముక్తి చెందిన ప్రాంతాలైన కర్ణాటక, మహారాష్ట్రలో సెప్టెంబర్ 17న అంగరంగ వైభవంగా జాతీయ జెండా ఎగురవేసి అక్కడి రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహిస్తున్నాయని గుర్తు చేశారు. కానీ తెలంగాణ రాష్ట్రంలో ఎంఐఎంకు భయపడి మైనార్టీ ఓట్లు ఎక్కడ పోతాయోనని నిర్వహించడం లేదని మండిపడ్డారు. సార్వత్రిక ఎన్నికలు ఎప్పుడు జరిగినా అధికారంలోకి వచ్చేది



బీజేపీ మాత్రమేనని అధికారంలోకి వచ్చిన వెంటనే సెప్టెంబర్ 17న ఎవరికి భయపడకుండా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి ఆడెపు రమేష్, కాంటెస్టెడ్ కార్పొరేటర్ అభ్యర్థి కునమల్ల రవి, డివిజన్ నాయకులు గబ్బేట శ్రీనివాస్, రాదారపు మల్లికార్జున్, మారేడు గొండ రమేష్, గనిపాక స్వామి, యువ మోర్చా నాయకులు, అప్పని సాగర్, పెట్టెం రాజకుమార్ తదితరులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వరంగల్ వాయిస్ Evening Daily
బుధవారం 06, సెప్టెంబర్ 2023
www.warangalvoice.net

# కాంగ్రెస్ పార్టీతోనే లంబాడాలకు న్యాయం



**వరంగల్ వాయిస్, దేవరుప్పుల :** మండలంలోని సింగరాజుపల్లి ఎంపీటీసీ పరిధిలోని ధారావత్ తండా, చింతాబాయి తండా, నల్లకుంట తండా, దొడ్లబండ తండా, కొత్త తండా, గోప్యానాయక్ తండా నుంచి పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి గౌడ్ అధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ అభ్యర్థి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మీడియా మాట్లాడుతూ లంబాడా గిరిజన ప్రజలను బీఆర్ఎస్ పార్టీ అన్ని విధాలుగా మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీయే లంబాడా ప్రజల సంక్షేమానికి తోడ్పడిందని, అందుకే బీఆర్ఎస్ ను వీడి కాంగ్రెస్ లో చేరుతున్నామని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ఎర్రబెల్లి దయాకర్ రావును, బీఆర్ఎస్ పార్టీని ఓడించాలని పెద్ది కృష్ణమూర్తి లంబాడాలకు పిలుపునిచ్చారు. అనంతరం పాలకుర్తి నియోజకవర్గం అభ్యర్థి హనుమండ్ల ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం లంబాడాలకు తీవ్ర ద్రోహం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఎస్సీ డిక్లరేషన్ లో చెప్పినట్టుగా ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు రూ.12లక్షల ఆర్థిక సాయం, అన్ని ప్రభుత్వ కాంట్రాక్టులలో ఎస్సీలకు 18శాతం, ఎస్టీలకు 12శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని పేర్కొన్నారు. ఇందిరమ్మ పక్కా ఇళ్ల పథకం ద్వారా ఇళ్లులేని ప్రతి ఎస్సీ, ఎస్టీ కుటుంబానికి ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.6లక్షలు అందజేస్తామన్నారు. బీఆర్ఎస్ ను వీడి కాంగ్రెస్ లో చేరినవారిని హనుమండ్ల ఝాన్సీ రెడ్డి అభినందించారు. తమ చేరిక కోసం సహకరించిన మండల పార్టీ అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి, తెలంగాణ ఉద్యమకారుడు, పాలకుర్తి నియోజకవర్గ నాయకుడు ఇప్ప పృథ్వీ రెడ్డికి బీఆర్ఎస్ను వీడిన వారు కృతజ్ఞతలు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారు ఆ పార్టీ పూర్వ అధ్యక్షుడు బిక్యా నాయక్, బీఆర్ఎస్ అధ్యక్షుడు ఆంబోతు రాజు, మాజీ ఆదర్శ రైతు కునుశోతు రాము, సీనియర్ నాయకులు కైలా, కిషన్, పరమేష్, మీనా, రమేష్, హరియా, జితేందర్, యాకు, శివాజీ, రాజా, అంగోత్ కిషన్ పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** విద్యార్థులు ఉపాధ్యాయులను గౌరవిస్తూ తమ భవిష్యత్ లను ఆదర్శప్రాయంగా మలచుకోవాలని సెవెన్ హిల్స్ హై స్కూల్ చైర్మన్ మొర్రి కుమార్ యాదవ్ అన్నారు. నగరంలోని చింతగట్టు గ్రామ శివారులో గల సెవెన్ హిల్స్ హై స్కూల్ అండర్ ది మేనేజ్మెంట్ అఫ్ స్కై వైబ్రేంట్ గ్రూప్ అఫ్ ఇన్ స్టిట్యూషన్స్ లో బుధవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మొర్రి కుమార్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తుకై ఉపాధ్యాయులను అనుక్షణం అనుసరిస్తూ, గౌరవిస్తూ వారి మార్గదర్శకత్వంలో తమ భవిష్యత్ ను ఆదర్శప్రాయంగా మలచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జక్కుల సామ్యగారు, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి నరెడ్ల అంజునారెడ్డి , పాఠశాల, కళాశాల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ఈతగాళ్లకు సత్కారం



**వరంగల్ వాయిస్, బాలసముద్రం :** స్వీప్ కార్యక్రమంలో భాగంగా బాలసముద్రం హనుమకొండలోని స్విమ్మింగ్ పూల్ లో డీఆర్ డీఓ ఆకవరం శ్రీనివాస్ కుమార్, స్వీప్ నోడల్ అధికారి ఎం. హరిప్రసాద్ జిల్లా క్రీడల అధికారి జి.అశోక్ ఆధ్వర్యంలో బుధవారం ఈతల పోటీలు నిర్వహించారు. పాల్గొన్న క్రీడాకారులను, ఈతగాళ్లను ఉద్దేశించి 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఫారం (6) ద్వారా ఆన్ లైన్ ఓటర్ ఆప్ లో ఓటరు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఓటు నమోదు చేసుకున్న ప్రతి పౌరుడు రాబోయే ఎన్నికలలో తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. ఈ ఈతల పోటీలలో గెలిచిన ఈతగాళ్లకు మెమెంటోలతో, కోచ్ లను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమములో జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్, మెప్మా ప్రాజెక్టు అధికారి భద్రు నాయక్, కోచ్ లు నవీన్, నరేందర్, ఏపీడీ పుల్లూరు శ్రీనివాస్, డీఆర్ డీఏ, ఏఓ కె.శ్రీనివాస్ రెడ్డి, నాయబ్ తహసీల్దార్ కె.మహేశ్వర్ రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సిబ్బంది, స్పోర్ట్స్ సిబ్బంది కోచ్ లు పాల్గొన్నారు.

## సేవ, క్రమశిక్షణతోనే గుర్తింపు

### ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కోడిమాల శ్రీనివాసరావు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** సేవ, క్రమశిక్షణతోనే గుర్తింపు లభిస్తుందని ఏవీవీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కోడిమాల శ్రీనివాసరావు అన్నారు. నూతన వాలంటీర్లకు ఎన్ఎస్ఎస్ పై అవగాహన సదస్సును బుధవారం కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.భుజంగ రెడ్డి మాట్లాడుతూ యాంత్రిక జీవితంలో విద్యార్థులు సేవా గుణం కలిగి సమాజంతో మమేకం కావాలన్నారు. వారు చేసే ఒక గొప్ప ప్రయత్నమే ఎన్ఎస్ఎస్ అన్నారు. ఇది మహాత్మా గాంధీ ఆశయాలకు అనుగుణంగా ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు సేవ చేయడం ద్వారా అక్కడున్న సమస్యలపై అవగాహన కలిగిస్తుందన్నారు. సమస్యల పరిష్కారంలో పాలుపంచుకోవడం తద్వారా యువత యొక్క వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించడం జరుగుతుందన్నారు. కొడిమాల శ్రీనివాసరావు మాట్లాడుతూ సమాజ సేవ, స్వీయ క్రమశిక్షణతోనే విద్యార్థి యొక్క వ్యక్తిత్వ వికాసం పెంపొందుతుందన్నారు. సేవ చేసే భాగ్యము విద్యార్థి దశ నుంచే కలిగే అవకాశం ఎన్ఎస్ఎస్ ద్వారా లభిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు సంజీవ, బి.గోపి, అధ్యాపకులు డాక్టర్ ఎస్.అనిత, డాక్టర్ శ్రీధర్, వాలంటీర్లు, సీనియర్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# పిడుగులు పడి మృతిచెందిన కుటుంబాలను ఆదుకోవాలి

### రూ.25లక్షల ఎక్స్ గ్రేషియో చెల్లించాలి

### బీకేఎంయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు టి. వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఇటీవల కురిసిన భారీ వర్షాల సందర్భంగా పిడుగులు పడి మరణించిన కూలీల కుటుంబాలకు రూ. 25 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించి ఆ కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యులు తాటిపాముల వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెక్కాడితేగాని డొక్కాడని కూలీ నాలీ చేసుకుని బ్రతికే శ్రమజీవులైన వ్యవసాయ కూలీలు జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రానికి చెందిన చిలువేరి సరిత, నేర్పాటి మమతలు మంగళవారం నాడు కూలీ పనికి వెళ్లి మిరప నారు పెడుతుండగా పిడుగులు పడి అక్కడికక్కడే మృతి చెందారు. మరికొందరు గాయాల పాలవడం, కాటారం మండలం దామెర కుంటకు చెందిన నిరుపేద కౌలు రైతు గూడూరి రాజేశ్వరరావు పొలంలో కలుపు తీయడానికి వెళ్లి పిడుగుపాటుకు గురై ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమన్నారు. వీరి మరణాలతో ఆ కుటుంబాలు దిక్కు తోచని స్థితిలో కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మరణించిన ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్ గ్రేసియో చెల్లించి అన్ని విధాల ఆదుకోవాలని అన్నారు. పిడుగుపాటుకు గాయాల పాలైన వారికి లక్ష రూపాయలు ఆర్థిక సాయం అందించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించనున్న ప్రత్యేక పార్లమెంటు సమావేశాల్లో జమిలీ ఎన్నికలు, ఇండియా పేరు భారత్ గా మార్చడం లాంటి ప్రజలకు ఉపయోగపడని అంశాలను పక్కకు పెట్టి కోట్లాదిమంది వ్యవసాయ కూలీలకు ఉపయోగపడే సమగ్ర వ్యవసాయ కార్మిక సంక్షేమ చట్టాన్ని చేసి అమలుపరిచేందుకు చర్యలు చేపట్టాలని వెంకట్రాములు డిమాండ్ చేశారు.

## ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** విద్యార్థులు భాష నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ఉన్నతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆర్పీలు ఎస్ఆర్జి నబీ, అజయ్ ప్రేమ్ సాగర్, అబ్దుల్ వహీద్, రవి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో గత మూడు రోజులుగా జరుగుతున్న శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. విద్యార్థుల్లో భాషా కౌశల్యాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వ పాఠశాలలో భాషా పండితులుగా విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు శిక్షణ నిర్వహించారు. విద్యార్థులలో భాషా నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ఇటువంటి శిక్షణ తరగతులు దోహదపడతాయని ఆర్పీలు పేర్కొన్నారు.

## స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకోవాలి



**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** ఆజాదీ కా అమృత్ మహోత్సవ ముగింపు కార్యక్రమంలో నా మట్టి నా దేశం (మేరి మట్టి మేరా దేశ్) లో భాగంగా భీమదేవరపల్లి బీజేపీ మండల అధ్యక్షుడు పైడిపల్లి పృథ్వీరాజ్ గౌడ్ అధ్యక్షతన రంగయ్య పల్లి గ్రామంలో హనుమాన్ దేవస్థానంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఈ కార్యక్రమంలో భాగంగా బూత్ అధ్యక్షుడు సింగం రాజేందర్ తో ప్రతి ఇంటి మట్టి స్వీకరణలో భాగంగా రంగయ్యపల్లి గ్రామంలో పలు గృహాల నుంచి మట్టిని స్వీకరించారు. అనంతరం ఈ సందర్భంగా బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి ప్రజలతో మమేకం అయి స్వాతంత్ర్యం కోసం పోరాడిన సమరయోధుల, తెలంగాణ విమోచనం కోసం పోరాడిన అమరవీరులను స్మరించుకునే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు వారు తెలిపారు. ప్రతి గ్రామం, మండలం, జిల్లా కేంద్రం, రాష్ట్ర రాజధాని నుంచి దేశ రాజధాని కి సేకరించిన మట్టిని పంపనున్నట్టు తెలిపారు. రాష్ట్ర రాజధాని నుంచి కేంద్ర రాజధానిలోని స్మారక వాటిక నిర్మాణం కోసం మట్టిని సేకరిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దొంగల కొమురయ్య, జిల్లా కార్యదర్శి మాచర్ల కుమార్, ప్రధాన కార్యదర్శి శ్రీరామోజు శ్రీనివాస్, దుర్గాసింగ్, మీసా మహేష్, అంబీర్ కవిత, బొల్లంపెల్లి శ్యామ్, బండారి కర్ణాకర్, నోముల భిక్షపతి, రాజయ్య, నిమ్మల శ్రీనాథ్, అబ్బారబోయిన శ్రీనివాస్, ఎలబోయిన అజయ్, అబ్బారాబోయిన శ్రీకాంత్, మామిడాల రామ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయుడిగా కాశిరెడ్డి ఆదిరెడ్డి



**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** మండలంలోని ములుకనూర్ లోని ఎస్ఆర్కే స్కూల్ ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ కాశిరెడ్డి ఆదిరెడ్డి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డును హనుమకొండ (పశ్చిమ) ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ చేతుల మీదుగా మంగళవారం అందుకున్నారు. ఈ ఏడాది జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను విద్యాశాఖ సోమవారం ప్రకటించింది. గురుపూజోత్సవం, ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈ అవార్డులు ప్రదానం చేశారు. అయితే ట్రస్మా (తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్), హడుప్సా (హనుమకొండ జిల్లా అన్ ఎయిడెడ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్) హనుమకొండ జిల్లా నుంచి ముగ్గురు ఉపాధ్యాయులు ఈ పురస్కారాలకు ఎంపికయ్యారు. కాగా భీమదేవరపల్లి మండలం నుంచి కాశిరెడ్డి ఆదిరెడ్డి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్, అడిషనల్ కలెక్టర్ మహేందర్ జీ, డీఈవో అబ్దుల్ హై పాల్గొన్నారు.

# ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండల కేంద్రంలోని నవోదయ ఉన్నత పాఠశాలలో బుధవారం శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు కృష్ణుని గోపికల వేషధారణలతో అలరించారు. విద్యార్థిని, విద్యార్థులు నృత్యాలు పలు ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులు ఉట్టి కొట్టి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ మామిడి అనురాధ, ప్రిన్సిపాల్ మామిడి పృథ్వీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## న్యూ లయోలా స్కూల్‌లో..



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని కుమార్ పల్లి మార్కెట్ లోని న్యూ లయోలా హై స్కూల్ లో బుధవారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు కృష్ణుడు, రాధ, గోపిక, బలరాముడు, యశోద, కంసుడు, ధర్మరాజు, భీముడు, అర్జునుడు, నకాలసహదేవుడు వివిధ వేషధారణలో ఆకట్టుకున్నారు. ఉట్టి కొట్టే కార్యక్రమంలో కూడా విద్యార్థులందరూ ఆసక్తిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.క్రాంతి కుమార్, ఉపాధ్యాయులు, ఉపాధ్యానియులు పాల్గొన్నారు.

## ఏకశిల కాన్సెప్ట్ స్కూల్‌లో..



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రెడ్డి కాలనీలోని ఏకశిల కాన్సెప్ట్ స్కూల్ లో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు శ్రీ కృష్ణ, గోపికల వేషధారణలో అలరించారు. ఈ వేడుకలకు ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిరుపతి రెడ్డి పాల్గొని పిల్లలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ స్వప్నారెడ్డి, ఉపాధ్యాయులు శోభ, పావని, సుమాంజలి, పవన్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కస్తూర్బా, ఆదర్శ గురుకులంలో..



**వరంగల్ వాయిస్, కాటారం :** గోకుల అష్టమి సందర్భంగా బుధవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలోని కస్తూర్బా, ఆదర్శ గురుకుల విద్యాలయంలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. కళాశాల గురుకుల విద్యాలయంలో ప్రత్యేక అధికారిని చల్లా సునీత, ఆదర్శ విద్యాసంస్థలు చైర్మన్ జనగామ కరుణాకర్ రావు, ప్రిన్సిపాల్ జనగామ కృషిత రావు ఆధ్వర్యంలో చిన్నారులు వివిధ వేషాధారణను అలంకరించారు. ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదర్శలో జరిగిన పిల్లల వేడుకలు అబ్బురపరిచాయి. అలాగే ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమాలలో ప్రిన్సిపాల్ చల్లా సునీత, ఆదర్శ కరెస్పాండెంట్ జనగామ కార్తీక్ రావు, ఉపాధ్యాయులు సుజాత రాజమణి, విజయ, కవిత, రాజేశ్వరి, నళిని, స్వప్న, రజిత, అరుణ, నాజియా, మణిమాల, శిరీష, లక్ష్మి, శ్రీలత, సరిత, ఏఎన్ఎం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు బహుమతుల అందజేత



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి, టీచర్స్ డే పురస్కరించుకొని బుధవారం సెయింట్ థామస్ హై స్కూల్ లో విద్యార్థులు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులను ఉద్దేశించి ఉపన్యాసాలు, పాటలు, నాటికలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ డి.మనోహర్ మాట్లాడుతూ టీచర్లు భావి సమాజ నిర్మాతలు దేశాభివృద్ధికి వెన్నెముక వంటి వారని వర్ణించారు.అనంతరం ఉపాధ్యాయులకు బహుమతులు అందజేశారు. హెడ్ మాస్టర్ ప్రణీత్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలి

## 7వ రోజు మోకాళ్లపై కూర్చొని నిరసన



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ముఖ్య మంత్రి కేసీఆర్ ఎన్నికల్లో చెప్పినట్టు కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్, ఎన్‌హెచ్‌ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామా రాజేష్ ఖన్నా డిమాండ్ చేశారు. నేషనల్ హెల్త్ మిషన్ స్ లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని, అలాగే బేషరతుగా ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులర్ డిమాండ్ చేశారు. బుధవారం రోజున సమ్మె 7వ రోజు సందర్భంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో డీఎంహెచ్ఓ కార్యాలయం ముందు ధర్నా మోకాళ్లపై కూర్చొని నిరసన చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కేసీఆర్ కాంట్రాక్టు కార్మికులందరినీ రెగ్యులర్ చేస్తానని చెప్పి దశబ్ద కాలం పూర్తవుతున్న ఒక్క ఉద్యోగిని కూడా పర్మినెంట్ చేయలేదని అన్నారు. సుమారుగా 15,000మంది ఉద్యోగులు గత 24 సంవత్సరాలు నుంచి పనిచేస్తూ చాలీచాలని వేతనాలు తీసుకుంటూ పేద, బడుగు, బలహీన వర్గాలకు వైద్యం అందించడంలో వారి ప్రాణాలను కాపాడడంలో అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో చెప్పినట్టు ఎన్ హెచ్ఎం స్కీంలో పనిచేస్తున్న ఉద్యోగులందరినీ ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులర్ చేయాలని అప్పటివరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఇన్సూరెన్స్ పదిలక్షలు కల్పించాలన్నారు. మరణించిన వారికి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉదృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎన్ హెచ్ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామా రాజేష్ ఖన్నా ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు దామెర కృష్ణ , జిల్లా సహాయ కార్యదర్శి ఉప్పుల రవి, జిల్లా నాయకులు పరికిరాల రమేష్, కుమార్, బోళ్ల వసంత, శాంత, ఎన్ హెచ్ఎం కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర నాయకురాలు జి.సరిత, ఎన్ హెచ్ ఎం హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీబాద్రి వేణు చైతన్య, పి.శ్రీధర్, అశోక్, వరంగల్ జిల్లా నాయకులు చిరంజీవి, స్వప్న, జ్యోతి, సుజాత, వైకుంఠం, సబిత, శోభా రాణి, పి.శ్రీధర్, అశోక్, గుడికందుల వాణి, మేకల మంజుల, రమాదేవి, గౌస్ పాషా, వెంకటేష్, వైకుంఠం, ఓ.సందీప్ కుమార్, రమేష్, కృష్ణమూర్తి, వరుణ, మమత, కొర్నెలు తదితరులు పాల్గొన్నారు.

## గొర్రెలను పంపిణీ చేసిన కార్పొరేటర్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ ఆదేశాల మేరకు నాలుగో డివిజన్ లోని యాదవ నగర్ లో యాదవులకు 7యూనిట్ల గొర్రెలను బుధవారం స్థానిక కార్పొరేటర్ బొంగు అశోక్ యాదవ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ ఊర్మిళ, సొసైటీ అధ్యక్షుడు శంకర్, లింగంపల్లి రాజయ్య, వేల్పుల సూరయ్య, సూదుల సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు కుటుంబానికి భద్రత చెక్కు అందజేత



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఆకస్మికంగా మరణించిన పోలీస్ కానిస్టేబుల్ కుటుంబానికి పోలీస్ భద్రత నుంచి మంజూరైన చెక్కును వరంగల్ పోలీస్ కమిషనర్ ఏ.వి. రంగనాథ్ బుధవారం అందజేసారు. వివరాల్లోకి వెళితే ఆర్మ్మ్‌డ్ రిజర్వ్ హెడ్ కానిస్టేబుల్ జి.సారయ్య కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతూ గత జూన్ 17న మరణించడంతో తెలంగాణ పోలీస్ భద్రత పథకం ద్వారా మరణించిన కానిస్టేబుల్ కుటుంబానికి మంజూర్ చేసిన రూ.7.97 లక్షల విలువ గల చెక్కులను పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా మరణించిన హెడ్ కానిస్టేబుల్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మరణించిన కానిస్టేబుల్ స్థితిగతులపై ఆరా తీయడంతో పాటు, శాఖాపరంగా రావల్సిన బెనిఫిట్లను అందజేసేందుకు తక్షణ చర్యలు తీసుకోవాల్సిందిగా పోలీస్ కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పరిపాలన విభాగం ఇంచార్జి అదనపు డీసీపీ రాగ్యానాయక్, సూపరింటెండెంట్ యుగేందర్ పాల్గొన్నారు

## అనాథ పిల్లలకు చేయూత



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ను ఆదర్శంగా తీసుకొని గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగం కావడం చాలా సంతోషంగా ఉందని రాష్ట్ర యువజన నాయకుడు, ఉమ్మడి వరంగల్ జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ అరూరి విశాల్ తెలిపారు. తన 27వ పుట్టినరోజు సందర్భంగా 27మంది 9, 10, ఇంటర్ చదివే అనాథ విద్యార్థులకు పాఠశాల, కళాశాల ఫీజులు చెల్లించడంతో పాటు వారి చదుకు అయ్యే పూర్తి ఖర్చును తాను సొంతంగా చెల్లించనున్నట్లు తెలిపారు. మంత్రి కేటీఆర్ స్ఫూర్తితో గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమం ద్వారా భవిష్యత్ లో మరిన్ని సేవా కార్యక్రమాలు చెపడతానని తెలిపారు.

## వరంగల్ నగర కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఇవ్వండి



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ నగర కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఇవ్వాలని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కూచన రవీందర్ కోరారు. గత నలభై సంవత్సరాలుగా (40)కాంగ్రెస్ పార్టీ జెండా మోస్తూ ఎప్పుడు పార్టీకి నిస్వార్ధంగా సేవ చేస్తున్న వరంగల్ కాశిబుగ్గ ప్రాంతానికి చెందిన బీసీ (పద్మశాలి)సామాజిక వర్గానికి చెందిన కూచన రవీందర్ బుధవారం కొండా దంపతుల ఆదేశానుసారం గాంధీభవన్ లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ ను కలిసి తన సేవలను గుర్తించి తనకే వరంగల్ జిల్లా “నగర కాంగ్రెస్ అధ్యక్ష” పదవి ఇవ్వాలని వినతి పత్రం సమర్పించారు.

# నియోజకవర్గ అభివృద్ధికి రూ.92 కోట్లు మంజూరు



**వరంగల్ వాయిస్, మరిపెడ :** డోర్నకల్ నియోజకవర్గంలో బీటీ రోడ్ల నిర్మాణ పనుల నిమిత్తం సుమారు రూ.92 కోట్ల 22లక్షల నిధులు మంజూరు అయినట్లు బీఆర్ ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొంపెల్లి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మరిపెడలోని ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో, తండాల్లో, డొంకల్లో రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని రాష్ట్ర మంత్రి సత్యవతి రాథోడ్ కు ఆయా గ్రామాల సర్పంచులు విన్నవించారు. మంత్రి ఐటీడీఏ అధికారులను అదేశించగా వారు క్షేత్రస్థాయిలో వారు పర్యటించి రోడ్డు నిర్మాణం కోసం ఐటీడీఏ నుంచి నిధుల మంజూరు చేశారన్నారు. శివాలయం వద్ద రోడ్డు నిర్మాణానికి అడిషనల్ గా రూ.72లక్షలు, తాళ్ల ఉకల్, వెంకంపాడ్ గ్రామాలకు అడిషనల్ గా రూ. 1కోటి 65లక్షలు, గుండెపుడి, గోలితండాకు రూ.1.50 లక్షలు, గిరిపురం పర్కజల్ తండాకు రూ.1.50, బాల్య తండాకు రూ. 1.50, నిలికుర్తి గ్రామంలో రేఖ్య తండా, పర్కాజల్ తండా బీటీ రోడ్డుకు రూ.1.50 లక్షలు, వెంకటియా తండా నుంచి నిలికుర్తి స్టేజి వరకు రూ.75 లక్షలు, హాట్యతండా,మన్నెగూడెం కు రూ.1.50 లక్షలు, లోక్య తండా నుంచి అబ్బాయి పాలెం రూ.1.50లక్షలు, రూప్సింగ్ తండా రూ.1.20 లక్షలు, మంగోరి గూడెంకు రూ.1.50 లక్షలు, గుర్రప్ప తండాకు రూ.1.60 లక్షలు, తోప్లా తండాకు రూ.1.65 లక్షలు మొత్తం రూ. 92 కోట్ల 22లక్షల్లో మరిపెడ మండలానికి రూ.22 కోట్ల 32 లక్షలు మంజూరు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ కు, ఆర్థిక మంత్రి హరీష్ రావుకు, రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు .మరిపెడ మండలంలోని ఆర్ అండ్ బీ వద్ద ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి సత్యవతి రాథోడ్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మరిపెడ మండల బీఆర్ ఎస్ నాయకులు కొంపెల్లి శ్రీనివాస్ రెడ్డి, మరిపెడ మాజీ సర్పంచ్ రాంలాల్, మాజీ ఎంపీటీసీ అంబరీష, మెంచు అశోక్, తొట్టి శ్రీను, వేణుగోపాల్ రెడ్డి, భరత్ నాయక్, యాకుబ్, సూర, రాజు నాయక్, సర్పంచ్ లు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

## బీసీలలో రాజకీయ చైతన్యం రావాలి

### చీఫ్ విప్ వినయ్ భాస్కర్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఈ నెల 10న హైదరాబాద్ సరూర్ నగర్ గ్రౌండ్ లో జరిగే బీసీ సింహ గర్జన సభ పోస్టర్ ను బుధవారం కుడా కార్యాలయంలో ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్ రాజ్ యాదవ్ విడుదల చేశారు. ఈ సందర్బంగా వినయ్ భాస్కర్ మాట్లాడుతూ జనాభాలో అత్యదిక భాగం 55శాతం ఉన్న బీసీలు రాజకీయంగా చైతన్యవంతం కావాలని పిలుపునిచ్చారు. బీసీలకు చట్టసభలో రిజర్వేషన్లు వచ్చే విధంగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ గౌడ్ మాట్లాడుతూ చట్ట సభలో రిజర్వేషన్ లేని కారణంగా బీసీలు రాజకీయంగా చాలా వెనుకబడి పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రములో త్వరలో జరగ బోయే శాసనసభ ఎన్నికల్లో బీసీల జనాభా ప్రకారం అన్ని పార్టీలు బీసీలకు సీట్లు కేటాయించాలని అన్నారు. సెప్టెంబర్ 10న హైదరాబాద్ సరూర్ నగర్ గ్రౌండ్స్ జరిగే బీసీల సింహగర్జనకు వరంగల్ ఉమ్మడి జిల్లా నుంచి బీసీ కులాలకు చెందిన ప్రజలు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాడి మల్లయ్య యాదవ్, ఎల్లయ్య, బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్ల సంపత్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు కాసగాని అశోక్, జిల్లా కార్యదర్శి మారగోని రవి, బుర్ర శ్రీనివాస్, గడ్డం యాదగిరి, రంజిత్, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

## ఖత్రి కులస్తుల బోనాలు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ 24వ డివిజన్ మట్టేవాడలో ఖత్రి కులస్తులు బోనాల పండుగను నిర్వహించారు. ఎస్ ఎస్ కే సేవా సమాజ్ ఆధ్వర్యంలో మహిళలు బోనాలు ఎత్తుకొని ర్యాలీగా తరలి వెళ్లి పోచమ్మ మైదానంలోని పోచమ్మ దేవాలయంలో అమ్మవార్లకు నైవేద్యంగా అర్పించారు. సేవా సమాజ్ అధ్యక్షుడు డాక్టర్ దీపక్ శోధన్, ప్రధాన కార్యదర్శి నాగరాజు, ధర్మరాజు, రాజ్ కుమార్, రామ్‌కిషన్ పాల్గొన్నారు

## బాధిత కుటుంబాలకు చేయూత



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండల కేంద్రంలో ఇటీవల మృతి చెందిన భాషని రాజమణి, బత్తుల రమేష్ లు మృతిచెందగా బుధవారం వారి దశదిన కర్మకు శాయంపేట ఎంపీటీసీ, ఉప సర్పంచ్ దైనంపల్లి జమున సుమన్ హాజరై మృతుల కుటుంబాలను పరామర్శించి 2క్వింటాళ్ల బియ్యం అందజేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల నాయకులు మారపల్లి మోహన్, బత్తుల కార్తీక్, దైనంపల్లి పాపయ్య, గట్టు శ్రీనివాస్, దైనంపల్లి కిరణ్, తట్ల సాయి, అనిల్, తదితరులు పాల్గొని మృతుల కుటుంబాలను పరామర్శించి సానుభూతి తెలియజేశారు.

# అర్హులకు దళిత బంధు కేటాయించాలి



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండల కేంద్రంలో అర్హులకే దళిత బంధు ఇవ్వాలని సీపీఐ, ఏబీఎస్ఎఫ్, బీఎస్ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. బుధవారం సీపీఐ మండల నాయకులు అరకిల్ల దేవయ్య మాట్లాడుతూ దళిత బంధు అర్హులకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. దళిత బందు ఇప్పిస్తామని చెప్పి శాయంపేట బీఆర్ఎస్ నాయకులు దళితుల దగ్గర డబ్బులు దండుకుంటున్నారని అన్నారు. దళితులు ఎవరూ దళిత బంధు కోసం అప్లికేషన్ పెట్టేందుకు ఎంపీడీఓ ఆఫీస్ కు వస్తున్నారో వాళ్లను గుర్తించి మీకు దళిత బంధు ఇప్పిస్తామని దానికి డబ్బులు ఖర్చువుతాయని చెప్పి వారి దగ్గర డబ్బులు వసూలు చేస్తున్న మోసపూరిత బీఆర్ఎస్ నాయకులను గుర్తించి వారిపైన కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించాలని అన్నారు. బీఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు మొగ్గం సుమన్ మాట్లాడుతూ దళిత బంధు మొదటి విడతలో బీఆర్ఎస్ నాయకులకే ఇచ్చారని అలానే ఇస్తే ఈ సారి ఎమ్మెల్యేను ఓడిస్తామని అన్నారు. దళిత బంధు పేరుతో దళిత వర్గాల్లో వర్గ పోరు లొల్లి పెట్టడం సరైనది కాదన్నారు. ఇస్తే ప్రతి ఒక్క దళిత కుటుంబానికి దళిత బందు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ నాగుల పవన్ కళ్యాణ్, సీపీఐ నాయకులు మారపెల్లి క్రాంతి కుమార్, వైస్సార్సీపీ టీపీ మండల అధ్యక్షుడు మారపెల్లి సుధాకర్ డాన్ పాల్గొన్నారు.

## మంచినీటి సమస్యను పరిష్కరించాలి

### బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ డిమాండ్



**వరంగల్ వాయిస్, కాజీపేట :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాజీపేట ప్రాంతంలో గత కొన్ని రోజులుగా నెలకొన్న మంచినీటి సరఫరా సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కాజీపేట లోని విష్ణుపురి వాటర్ ట్యాంక్ వద్ద స్థానిక ప్రజలు, బీజేపీ కార్యకర్తలతో కలిసి విష్ణుపురి ప్రధాన రహదారిపై ఖాళీ బిందెలతో బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికీ నీరు అన్ని చెప్పి, వీధి వీధికి లిక్కర్ షాపులు తెరిచిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదని మండిపడ్డారు. ఈ బీఆర్ఎస్ ప్రభుత్వం లీకేజీ, ప్యాకేజీలకు మాత్రమే పరిమితమైనదని పాలకులను విమర్శించారు. కాజీపేట ప్రజల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వానికి, స్థానిక ప్రజాప్రతినిధులకు సోయిలేదని అన్నారు. కాజీపేట ప్రాంతంలో గత 15రోజులుగా మంచినీటి సరఫరా లేకపోవడం ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే నీటి సరఫరా సమస్యను పరిష్కరించే విధంగా ప్రభుత్వం, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలని రావు పద్మ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ హనుమకొండ జిల్లా నాయకులు, జిల్లా అధికార ప్రతినిధులు, డివిజన్ల అధ్యక్షులు, యువ మోర్చా నాయకులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## 8న నేతాజీ ఫార్మసీ కళాశాలలో జాబ్ మేళా

**వరంగల్ వాయిస్, కాజీపేట :** కాజీపేట సోమిడి శివారులోని నేతాజీ ఫార్మసీ కళాశాలలో బీఫార్మసీ, బీఎస్సీ విద్యార్థినీ, విద్యార్థులకు ఈనెల 8న ఉదయం 10 గంటలకు క్యాంపస్ ప్లేస్ మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ రాకేష్ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ బాబురావు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్యాంపస్ ప్లేస్ మెంట్ డ్రైవ్ లో ఎంఎస్ఎన్ ల్యాబరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ తెలంగాణ పాల్గొంటుందని అన్నారు. ఈ కంపెనీ సుమారు 200 మందికి జూనియర్ ఎగ్జిక్యూటివ్ ట్రైనీస్‌గా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందన్నారు. విద్యార్థిని, విద్యార్థులు ఈసదవకాశాన్ని వినియోగించుకోవాలని కళాశాల ప్లేస్‌మెంట్ సెల్ ఇంచార్జి డాక్టర్ టి.శ్రీకాంత్, డాక్టర్ మహమ్మద్ రవూఫ్ తెలిపారు. మరింత సమాచారం కోసం ప్లేస్ మెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ యు.పావని, డాక్టర్ ఏ.భార్గవి లత, పి.సునీల్ కుమార్ 8897476836, బి.అనిల్ కుమార్ లను సంప్రదించాలని కోరారు.

## అంగన్వాడీలను పర్మినెంట్ చేయాలి

### 11 నుంచి నిరవధిక సమ్మె

### జిల్లా అధ్యక్షురాలు బెస్త సంపూర్ణ



**వరంగల్ వాయిస్, మరిపెడ :** అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పర్మినెంట్ చేయాలని తెలంగాణ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బెస్త సంపూర్ణ అన్నారు. బుధవారం మరిపెడ మండల కేంద్రంలోని స్థానిక తహసీల్దార్ సైదులు, మరిపెడ ఎస్సై దూలం పవన్ కుమార్ లకు సమ్మె నోటీసు వివరాలను అందజేశారు. ఈ సందర్భంగా బేస్త సంపూర్ణ మాట్లాడుతూ సెప్టెంబర్ 10నాటికి అంగన్వాడీ సమస్యలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వెంటనే పరిష్కరించాలని, లేకుంటే సెప్టెంబర్ 11 నుంచి సీఐటీయూ, ఏఐటీయూసీ అనుబంధ సంఘాల జేఏసీల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె చేయనున్నట్లు ఆమె తెలిపారు. ఈ సమ్మెకు రాష్ట్ర ప్రజలు సహకరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు మంద పుష్ప, ప్రధాన కార్యదర్శి కుమ్మరి కుంట్ల జ్యోతి, నాయకురాలు అనబత్తుల రేణుక, గుమ్మడి కళమ్మ, లక్ష్మి, ముదిరెడ్డి శ్రీలత, తదితరులు ఉన్నారు.

# జవాన్ సినిమాపై భారీ అంచనాలు



## హాట్ కేకుల్లా అమ్మడవుతున్న టిక్కెట్లు

జవాన్ రిలీజ్‌కు ఇంకా కొన్ని గంటలే మిగులుంది. ఇప్పటికే టిక్కెట్‌లు హాట్ కేకుల్లా అమ్ముడవుతున్నాయి. ఒక్క బుక్ మై షో ఆప్‌లోనే కోటికి పైగా టిక్కెట్‌లు అమ్ముడయ్యాయంటే మాములు విషయం కాదు. నార్త్‌లోనే అనుకుంటే సౌత్‌లోనూ ఈ సినిమా క్రేజ్ చూస్తే మెంటలెక్కుతుంది. హైదరాబాద్ సహా పలు సిటీలలో బుకింగ్స్ వీర లెవల్లో ఉన్నాయి. ఈ సారి తెలుగు రాష్ట్రాల్లోనూ షారుఖ్ భారీ స్థాయిలో ఓపెనింగ్స్ నమోదు చేసేలా కనిపిస్తున్నాడు. హిందీతో పాటు తమిళ, తెలుగు భాషల్లో ఈ సినిమా సెప్టెంబర్ 7న రిలీజ్ కానుంది. ఈ సినిమాలో విజయ్ సేతుపతి ప్రతినాయకుడి పాత్ర పోషించాడు. ఇక ఈ సినిమా కోసం కేవలం సినీ ప్రియులు మాత్రమే కాకుండా సినీ సెలబ్రెటీలు సైతం అమితాసక్తితో ఎదురు చూస్తున్నారు. ఇదే విషయాన్ని మహేష్ ట్విటర్‌లో పోస్ట్ చేశాడు. ' జవాన్ టైమ్ వచ్చేసింది. షారుక్ ఖాన్ పవర్ మొత్తం వెండితెరపై కనబడబోతుంది. ఈ సినిమా అన్ని మార్కెట్లలోనూ ఆల్ టైమ్ బ్లాక్ బస్టర్ సక్సెస్ సాధించాలని కోరుకుంటున్నా. కుటుంబ సభ్యులతో కలిసి సినిమా చూసేందుకు ఎదురు చూస్తున్నానంటూ' మహేష్ వేసిన ట్వీట్ తెగ వైరల్ అవుతుంది. ఈ ట్వీట్‌పై షారుఖ్ ఖాన్ స్పందించాడు. మహేష్ బాబుకు థ్యాంక్యూ చెబుతూ.. 'మీరు సినిమాను ఎంజాయ్ చేస్తారని ఆశిస్తున్నాను. మీరు ఎప్పుడు సినిమాకు వెళ్తారో చెప్పండి మీతో పాటు కలిసి సినిమా చూస్తానంటూ' షారుఖ్ రిప్లే ఇచ్చాడు. ఇలా ఇద్దరూ హీరోలు ట్వీట్లు చేసుకోవడంతో ఫ్యాన్స్ సంబురాలు చేసుకుంటున్నారు. అట్లీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా యాక్షన్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కింది. ఇప్పటికే రిలీజైన టీజర్, ట్రైలర్‌లు సినిమాపై మాములు అంచనాలు క్రియేట్ చేయలేదు. ఈ సినిమాను రెడ్ చిల్లీ ఎంటర్‌టైనమెంట్స్ బ్యానర్‌పై షారుఖ్ భార్య గౌరీ ఖాన్ నిర్మిస్తుంది. షారుఖ్‌కు జోడీగా నయనతార హీరోయిన్‌గా నటిస్తుంది.

## మూడేళ్ల గ్యాప్‌తో..


'నిశబ్దం' తర్వాత అనుష్క శెట్టి 'మిస్ శెట్టి... మిస్టర్ పొలిశెట్టి' చిత్రంతో మళ్లీ తెరమీద కనిపించనున్నారు. ఈ సినిమా గోకులాష్టమి సందర్భంగా గురువారం విడుదలవుతోంది. అందులో ఆమె పాత్ర ఎలా ఉండబోతోంది? ప్రేక్షకులు ఈ సినిమా నుంచి ఏమి ఆశించవచ్చు అనే విషయాలను అనుష్క మాట్లాడుతూ...మూడు సంవత్సరాల తర్వాత మళ్లీ నా సినిమా వస్తోంది. సినిమాల నుంచి ఒక బ్రేక్ కావాలనుకున్నా.. తీసుకున్నా. 'మిస్ శెట్టి... మిస్టర్ పొలిశెట్టి' ప్రేక్షకులకు ఎంతో నచ్చుతుంది. వారికి కావాల్సిన అన్ని రకాల ఎమోషన్స్ దీనిలో ఉన్నాయి. ఒక అందమైన ప్రేమకథ ఇది. కుటుంబమంతా కలసి చూడదగ్గ సినిమా ఇది. థియేటర్‌లోంచి ప్రేక్షకులు చాలా హ్యాపీగా బయటకు వస్తారనే నమ్మకం నాకు ఉంది. ఈ మూడేళ్ల గ్యాప్‌లో నేను చాలా (స్క్రిప్ట్స్) విన్నా. వాటిలో కొన్ని నచ్చాయి కూడా. కానీ ఈ సినిమా చాలా ప్రత్యేకమైనది. దీని కథాంశం చాలా భిన్నమైనది. నా అభిమాను లందరికి తప్పనిసరిగా నచ్చుతుంది. కొవిడ్ తర్వాత మన జీవితాల్లో అనేక మార్పులు వచ్చాయి. అదే విధంగా పదేళ్ల క్రితం నాటికి.. ప్రస్తుతానికి సమాజం కూడా చాలా మారింది. ఒకప్పుడు స్టాండప్ కామెడీ అనేది ఎవరో కొద్ది మందికి మాత్రమే తెలుసు. ఇప్పుడు చాలా మందికి తెలుసు. ఈ సినిమా తర్వాత ఇంకా ఎక్కువ మందికి తెలుస్తుంది. అనేక మంది యువతీ, యువకులు దీనిని ఒక వృత్తిగా కూడా స్వీకరిస్తారనుంటున్నా. షూటింగ్ చేస్తున్నప్పుడు ఆనందంతో నా కళ్లలో నీళ్లు వచ్చాయి. ఎందుకంటే నా జీవితంలో సగభాగం సినీ పరిశ్రమలోనే ఉన్నా. సినిమా ఇండస్ట్రీలో ఏదో ఒక మ్యాజిక్ ఉంది. ఆ మ్యాజిక్‌ను ఎంత మిస్ అయ్యానో ఇప్పుడు తెలుస్తోంది.



## అక్షయ్ సినిమా మిషన్ రాణిగంజ్‌గా మార్పు



ఓ మై గాడ్ చిత్రంతో బాలీవుడ్‌లో చాలా రోజులకు హిట్ కొట్టాడు స్టార్ హీరో అక్షయ్ కుమార్ . ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం ది గ్రేట్ ఇండియన్ రెస్క్యూ. బాలీవుడ్ హీరోయిన్ పరిణీతి చోప్రా కథానాయికగా నటిస్తుంది. 1989లో రాణిగంజ్ అనే మైనింగ్ ఏరియాలో జరిగిన ప్రమాదంపై ఈ మూవీ తెరకెక్కుతుంది. ఈ ప్రమాదంలో జస్వంత్ సింగ్ గిల్ అనే మైనింగ్ ఇంజనీర్ మైనింగ్‌లో చిక్కుకున్న 64 మందిని కాపాడారు. అతని జీవిత కథ ఆధారంగా ఈ సినిమా రానుంది. ఇక కేసరి వంటి బ్లాక్ బస్టర్ చిత్రం తరువాత అక్షయ్, పరిణీతి మళ్లీ కలిసి నటిస్తుండడంతో ఈ చిత్రంపై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రానికి టిను సురేష్ దేశాయ్ దర్శకత్వం వహిస్తుండగా.. పూజా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై వశ్ భగ్నానీ నిర్మిస్తున్నాడు. ఇప్పటికే ఈ మూవీ షూటింగ్ పూర్తికాగా.. ఈ మూవీ నుంచి సాలిడ్ అప్‌డేట్ బయటకు వచ్చింది. ఈ సినిమా టైటిల్‌ను మారుస్తున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ది గ్రేట్ ఇండియన్ రెస్క్యూ అనే మూవీ టైటిల్‌ను 'మిషన్ రాణిగంజ్' గా పేరు మార్చినట్లు మేకర్స్ ప్రకటించారు. టీజర్‌ను అక్షయ్ కుమార్ బర్త్ డే పుట్టినరోజు కానుకగా సెప్టెంబర్ 9 విడుదల చేయనున్నట్లు సమాచారం. చిత్రంలో అక్షయ్, పరిణీతితో పాటు, రాజేష్ శర్మ, రవి కిషన్, గౌరవ్ ప్రతీక్, అనంత్ మహదేవన్ దిబ్యేందు భట్టాచార్య కీలక పత్రాలు పోషిస్తున్నారు.



# విజన్ ఉన్న నేత కేసీఆర్

**అన్ని రంగాల్లో తెలంగాణ అభివృద్ధి**

**పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు**



**వరంగల్ వాయిస్, పరకాల :** ముఖ్యమంత్రి కేసీఆర్ విజన్ ఉన్న నేత అని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కొనియాడారు. ఆయన దార్శనికతతోనే తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. పరకాల నియోజకవర్గం పరిధిలోని సంగెం మండలం గుంటూరుపల్లి గ్రామంలో బుధవారం స్థానిక శాసనసభ్యులు చల్లా ధర్మారెడ్డి, జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్యతో కలిసి రూ. రూ.3.10 కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్లు, మహిళా భవనం, వైకుంఠధామం, డంపింగ్ యార్డ్, పల్లెప్రకృతి వనం, క్రీడా ప్రాంగణాల పనులకు మంత్రి శంఖుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం పంట నష్టపరిహారం చెక్కులను పంపిణీ చేశారు. సంగెం మండలం కాపులకనపర్తి గ్రామంలో నూతనంగా రూ.8.18 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్లు, స్మశాన వాటిక, డంపింగ్ యార్డ్, పల్లెప్రకృతివనం, గ్రామపంచాయతీ భవనం, రైతు వేదిక, బీటీ రోడ్డును వారు ప్రారంభించారు. అనంతరం అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడ్డాక ముఖ్యమంత్రి చేపట్టిన సాగు నీటి ప్రాజెక్టులతో వాగులు, వంకలు, చెరువులు నిండు కుండలను తలపిస్తున్నాయన్నారు. దీంతో నీటి కష్టాలు తీరాయన్నారు. రైతు బంధు ద్వారా ఎదురు పెట్టుబడి ఇచ్చి వ్యవసాయ రంగాన్ని ప్రోత్సాహిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ పల్లెలు బాగు పడితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని భావించిన ముఖ్య మంత్రి కేసీఆర్ గంగాదేవిపల్లెకి వచ్చి గ్రామజ్యోతి కార్యక్రమాన్ని ప్రారంభించి గ్రామాల అభివృద్ధికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, మార్కెట్, సొసైటీ చైర్మన్లు, కమిటీ సభ్యులు, రైతుబంధు కన్వీనర్లు, సభ్యులు, బీఆర్ ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.



# ఘనంగా పోచమ్మ బోనాలు

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** నగరంలోని 40 వ డివిజన్ ఉర్సు గుండు మైసమ్మ దేవాలయంలో శ్రావణ మాసం సందర్భంగా పోచమ్మ తల్లి విగ్రహాన్ని ప్రతిష్టించి గత మూడు రోజులు అంగరంగ వైభవంగా పూజలు చేశారు. చివరి రోజు బుధవారం శివసత్తులు అయిత హరీష్ ఆధ్వర్యంలో డప్పుచప్పుల్లతో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు అయిత భిక్షపతి, అధ్యక్షుడు గుడిమల్ల మోహన్, కార్యదర్శి కనుకుంట్ల రవి, ఉపాధ్యక్షుడు మాటేటి సంపత్, సహాయ కార్యదర్శి కళ్యాణపు వెంకటేశ్వర్లు, ఆర్గనైజర్లు మాటేటి సారయ్య, కళ్యాణపు యుగేందర్, సభ్యులు వనం భాస్కర్, గుడిమల్ల శ్రీనివాస్, అయిత రమేష్, క్యాతం రాజేందర్, మార్గం సతీష్, గూడూరు మధు, పల్నాటి రత్నాకర్, కూచన మురళీధర్, సాంబె ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

**ములుగు ఎమ్మెల్యే సీతక్క**

**బీఆర్ఎస్ నుంచి పలువురు కాంగ్రెస్‌లో చేరిక**



**వరంగల్ వాయిస్, ములుగు :** వచ్చే శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించి అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ జాతీయ మహిళా ప్రధాన కార్యదర్శి, ములుగు ఎమ్మెల్యే సీతక్క ఆశాభావం వ్యక్తం చేశారు. ములుగు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కన్నాయి గూడెం మండలంలోని సర్వాయి చిట్యాల గ్రామం సర్పంచ్ ఆలం శారద చిరంజీవితో పాటు వార్డు సభ్యులు సోయం లక్ష్మయ్య, ఆలం వెంకటేష్, సుధాకర్, బంధం జయరాజు, ఆలం మహేష్, కంతం రాఘవులు, కంతం శైలజ, స్వర్ణలత తదితరులు బుధవారం సీతక్క సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ గడిచిన 10 సంవత్సరాల కేసీఆర్ పాలనలో ఒక్క పేదవాడికి న్యాయం జరుగలేదన్నారు. తెలంగాణ వస్తే బతుకులు మారుతాయి..బాధలు తీరుతాయి అని నమ్మిన ప్రజలను కేసీఆర్ నట్టేట ముంచారన్నారు. పేదల కష్టాలు తీరాలంటే, సంక్షేమ పథకాలు అమలు కావాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలన్నారు. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించండి, ఒక్క అవకాశం ఇవ్వండి అంటూ సీతక్క కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎండి.అప్సర్ పాషా, మండల ఇంచార్జి జాడి రాంబాబు, ములుగు మండల వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు నల్లెల భరత్ కుమార్, పట్టణ అధ్యక్షుడు చింత నిప్పుల భిక్షపతి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు సునార్కని రాంబాబు, ఎంపీటీసీ చిట్యాల శైలజ, అరుణ్ కుమార్, యూత్ నాయకులు దుర్గం ప్రభాకర్, యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ గంధర్ల నర్సింగాపూర్, భూపతిపూర్, ములుగు మండల ఉపాధ్యక్షులు అర్షం రఘు, ఉపసర్పంచ్ ఆలం జంపయ్య, బంధం రాఘవులు, జనగాం వెంకట్, ఓరుగంటి అనీల్ యూత్ నాయకులు లక్కీ,ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు నివేశన స్థలాలను గుర్తించండి

**కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను ఆదేశించిన దాస్యం, అరూరి**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గ్రేటర్ వరంగల్ పరిధిలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు ప్రభుత్వం నుంచి అందించాల్సిన ఇళ్లస్థలాలను తక్షణమే గుర్తించాలని హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ ను బుధవారం ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయభాస్కర్, వర్ధన్నపేట ఎంఎల్ఏ ఆరూరి రమేష్ ఆదేశించారు. అర్హులైన జర్నలిస్టులకు సొంతింటి స్థలం కోసం అనువైన స్థలాలను సిక్స్ మెన్ కమిటీతో కలసి గుర్తించాలని కలెక్టర్ కు అధికారికంగా లేఖలు అందించారు. రెండు హౌజింగ్ సొసైటీల్లో లేని వర్కింగ్ జర్నలిస్టులకు ఇంటిస్థలం ఇస్తామని మంత్రి కేటీఆర్ హమీ ఇచ్చారని, ఆ హమీని నిలబెట్టేందుకు తాము సిద్దంగా ఉన్నామని ఈ సందర్భంగా ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయభాస్కర్ సిక్స్ మెన్ కమిటీకి హామీ ఇచ్చారు. మంత్రి కేటీఆర్ పర్యటన లోగా అనువైన స్థలాలు గుర్తించేందుకు కృషి చేస్తానని అన్నారు. హనుమకొండ కలెక్టర్ కు అధికారిక లేఖలు అందించే కార్యక్రమంలో సిక్స్ మెన్ కమిటీ కన్వీనర్ బీఆర్ లెనిన్, కో-కన్వీనర్లు బొక్క దయాసాగర్, వేముల నాగరాజు, సభ్యులు గడ్డం రాజిరెడ్డి, మసకపురి సుధాకర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి, అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ)మహేందర్ జీ, తదితరులు పాల్గొన్నారు.

# 18న వినాయక చవితి

**కాణిపాకంలో కూడా అప్పుడే బ్రహ్మోత్సవాలు**

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** ఈ యేడాది వినాయక చవితి పర్వదిన్నాన్ని సెప్టెంబర్ 18న నిర్వహించాలని నిర్ణయించారు. ఏ తేదీన నిర్వహించాలనే సందిగ్ధతపై తెలంగాణ విద్వత్ సభ గౌరవ సలహాదారు ఆకెళ్ళ జయకృష్ణ శర్మ సిద్దాంతి వివరణ ఇచ్చారు. శ్రీ శోభకృత్ నామ సంవత్సర భాద్రపద శుద్ధ తృతీయ సోమవారం 18న వినాయక చవితి పండుగను అందరూ జరుపుకోవాలని ఆయన సూచించారు. తెలంగాణ విద్వత్ సభలో సుమారు వంద మంది పండితులందరూ ఏకముఖముగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. చంద్రమానం ప్రకారం చవితి తిథి 18వ తేదీనే ఉన్నందున అదే రోజు పండుగ జరుపుకోవడం శుభప్రదమన్నారు. ఇక ఇదే విషయమై కాణిపాకం వరసిద్ధి వినాయకుడి దేవస్థానం పండితులు కూడా స్పష్టతనిచ్చారు. 18 నుంచి 21 రోజుల పాటు కాణిపాకంలో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామని వెల్లడించారు.

# ముంపు నివారణకు హైదరాబాద్ తరహా చర్యలు

**9న మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా కాళోజీ కళాక్షేత్రం ప్రారంభం**

**ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, ఎంఏయూడీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** గ్రేటర్ వరంగల్ పరిధిలో ముంపు నివారణకు హైదరాబాద్ తరహా చర్యలు చేపట్టనున్నట్లు ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, ఎంఏయూడీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్ ప్రకటించారు. బుధవారం నగరానికి విచ్చేసిన అరవింద్ కుమార్ నగర మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యేలు నన్నపనేని నరేందర్, ఆరూరి రమేష్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, కుడా చైర్మన్ సుందర్ రాజ్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ లు అశ్విని, మహేందర్ జీలతో కలిసి పలు పథకాల కింద చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు వరంగల్ మహా నగర ప్రజలకు వరదల నుంచి శాశ్వత ఉపశమనం కలిగించే విధంగా గ్రేటర్ హైదరాబాద్ లో చేసిన మాదిరిగా జీడబ్ల్యూఎంసీలో వ్యూహాత్మక నాలాల అభివృద్ధి కార్యక్రమం (ఎస్ ఎన్ డీపీ) చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఉన్నతాధికారులు సంబంధిత ఏజెన్సీతో గ్రేటర్ పరిధిలో ఉన్న చెరువులు, విలీన గ్రామాలను పరిగణలోకి తీసుకొని వర్షపాత డాటా ప్రకారం రూపొందించిన డ్రైనేజీ దీర్ఘకాలిక మాస్టర్ బేసిక్ ప్లాన్ ను మేయర్, ప్రజా ప్రతినిధులతో పరిశీలించామని, అవసరమైన నిధులు మంజూరు చేసి గ్రేటర్ వరంగల్ లో వరద నీరు సులువుగా వెళ్ళే విధంగా 30 కిలోమీటర్ల మేర ఎస్ ఎన్ డీపీ పనులను త్వరలో ప్రారంభిస్తామన్నారు. ఈనెల 9వ తేదీన ప్రజా కవి కాళోజి నారాయణరావు జయంతి సందర్భంగా రాష్ట్ర పురపాలక శాఖ మాత్యులు కేటీఆర్ చేతుల మీదుగా కాలోజీ కళాక్షేత్రం ప్రారంభించనున్నట్లు దాస్యం వినయ్ భాస్కర్, అరవింద్ కుమార్ ప్రకటించారు. ఈ సందర్భంగా కవులు, కళాకారులచే పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నగరంలో మంచినీటి సరఫరాపై అధికారులతో సమీక్షించామని, వర్షం కారణంగా దెబ్బతిన్న పైపులైన్ లను వెంటనే పునరుద్ధరించి, సమస్యలను అధిగమించి ప్రజలకు ప్రతి రోజు తాగునీరు సరఫరా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, కార్పొరేటర్ స్వరూపరాణి, చెన్నం మధు, వేముల శ్రీనివాస్, మునిసిపల్, రెవెన్యూ, ఇరిగేషన్, ఆర్ అండ్ బి, కుడా అధికారులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com